ప్రజాశక్తి

సోమవారం 7 అక్టోబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

పరిశీలనాత్మక దృక్పథంతో ఏ రంగంలోనైనా రాణించొచ్చు

- ప్రముఖ సినీ నటులు అజయ్ ఘోష్
- ఘనంగా తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు

వార్త మెయిన్‌లో



ప్రముఖ సినీనటులు అజయ్‌ఘోష్‌ను సన్మానిస్తున్న షార్ట్ ఫిల్మ్ పోటీల నిర్వాహకులు

టమాటా ధర దిగొచ్చేనా!

- రైతు బజార్లలో కిలో రూ.71
- బహిరంగ మార్కెట్లో రూ.100
- నేటి నుంచి రైతు బజార్లకు మార్కెటింగ్ శాఖ ద్వారా సరఫరా

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: పప్పు, కూరగాయలు, చికెన్, మటన్, చారు, రసం, పులుసు కూర, రోటి పచ్చడి ఏదైనా వాటిలో టమాటా ఇట్టే కలిసిపోతుంది. ఆయా వంటకాలకు, పచ్చళ్లకు రుచిని అందిస్తుంది. సామాన్యులకు అందుబాటు ధరలో ఉండే కూరగాయాల్లో టమాటా ఒకటిగా ఉండటంతో దీని వినియోగం ఎక్కువగా ఉంటుంది. గత కొన్ని రోజులుగా టమాటా ధరలకు రెక్కలు వచ్చాయి. కృష్ణాజిల్లాలోని రైతు బజార్లలో కిలో టమాటా రూ.71 , బహిరంగ మార్కెట్లో రూ.100కు చేరింది. ఆకాశాన్నంటిన ధరలను చూసి సామాన్యులు టమాటా వినియోగాన్ని మానుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి రాయితీ ఇవ్వకుండానే టమాటా ధరల నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏ మేరకు సత్ఫలితాలిస్తాయనేది చర్చనీయాంశమైంది.

వినియోగదారులకు ఊరట ఎంత?

ఈ పరిస్థితుల్లో మార్కెటింగ్ శాఖ జిల్లాలోని అన్ని రైతు బజార్లకు సోమవారం నుంచి టమాటాలను సరఫరా చేయనుంది. రైతుల నుంచి నేరుగా టమాటాను సేకరించి, రవాణా ఖర్చులను జమ చేసి లాభనష్టాలు లేకుండా (నోలాస్, నో ప్రాఫిట్) (మిగతా 2లో)

నేడు ఎన్‌టిఆర్ జిల్లాలో గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల్లో అన్ని శాఖలకు చెందిన అధికారులు విధుల్లో ఉన్నందున ఈ నెల 7వ తేదీ సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టం) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించి జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, సిపి రాజశేఖరబాబు

యాత్రికుల సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ

ప్రజాశక్తి-విజయవాడ, వన్‌టౌన్

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాల్గో రోజు ఆదివారం అమ్మవారు శ్రీ లలితా త్రిపురసుందరి దేవి అలంకరణలో యాత్రికులకు దర్శనమిచ్చారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. క్యూలైన్లో పసిబిడ్డలతో వచ్చే యాత్రికులకు వేడి పాలు సరఫరా చేస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో మజ్జిగ ప్యాకెట్లను, మంచినీరు బాటిల్స్ అందిస్తున్నారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సత్యనారాయణ ఆదేశాలతో క్యూలైన్లో అవసరమైన చోట ఫ్యాన్లు ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. వికలాంగులు, వృద్ధులకు దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విఐపిలు వస్తున్నప్పటికీ సామాన్య యాత్రికుల దర్శనానికి ఇబ్బంది కలగకుండా క్యూలైన్ ఆగకుండా ఏర్పాట్లు చేయాలని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ ఇఒ రామారావు నిరంతరం ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఆదివారం కావడంతో యాత్రికుల తాకిడి ఎక్కువగా ఉన్నప్పటికీ ఎటువంటి ఆటంకాలు కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

క్యూలైన్లు పరిశీలన

దసరా ఉత్సవాల్లో భాగంగా క్యూలైన్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబుతో ఆదివారం పరిశీలించారు. యాత్రికులకు తాగునీరు, పాలు, మజ్జిగ తదితరాల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. యాత్రికులతో మాట్లాడారు. యాత్రికులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని

వివిధ శాఖల అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆదివారం పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తారని ముందే ఊహించి అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎక్కడ లోటు ఉన్నా వెంటనే గుర్తించి సరిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధిమీనా, ముంబై నటి కాదంబరీ జాత్వానీ దర్శించుకున్నారు.

ఇంద్రకీలాద్రిపై పెరిగిన రద్దీ

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో యాత్రికులు దుర్గమ్మ దర్శనం కోసం తరలివచ్చారు. ఉత్సవాల నిర్వహణలో వివిధ శాఖల సమన్వయం కారణంగా అమ్మవారి దర్శనాలు ప్రశాంతంగా సాగాయి. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు యాత్రికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

కొలికపూడి మాకొద్దు

- **నియోజకవర్గ సమావేశానికి టిడిపి నేతలు గైర్హాజరు**

ప్రజాశక్తి-తిరువూరు: ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై తెలుగు తమ్ముళ్లలో రగులుతున్న అసంతృప్తి జ్వాలను చల్లార్చడానికి టిడిపి అధిష్టానం చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. కొలికపూడి మాకొద్దు అని అసంతృప్తి నేతలు ముక్తకంఠంతో నినదించారు. ఎమ్మెల్యే తీరుతో నాయకుల, కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయని భావించిన అధిష్టానం భావించింది. ఈ క్రమంలో ఎంపి కేశినేని చిన్ని, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, నియోజక వర్గ పరిశీలికులు చిట్టిబాబు, ఎమ్మెల్యే శ్రీనివాసరావుతో కలిసి టిడిపి నియోజకవర్గ స్థాయి సమావేశం తిరువూరు శ్రీరస్తు కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. అయితే తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాలకు చెందిన ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం సమావేశానికి వెళ్లకుండా లక్ష్మీపురం మనో గార్డెన్‌లో సమావేశమయ్యారు. చిన్నిని, వర్ల రామయ్యను, చిట్టిబాబులను ఆహ్వానించి తాము ఇచ్చిన ఫిర్యాదుపై ఎమ్మెల్యే ఇచ్చిన వివరణ చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యేతో మాట్లాడామని, ఆయనపై వచ్చిన 15 ఆరోపణలపై వివరణ అడిగామని చెప్పారు. తన వైఖరి మార్చుకోవాలని హితబోధ చేసినట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే తన వైఖరి మార్చుకుంటానని, అందర్నీ కలుపుకు పోతానని చెప్పిన దాని మేరకు అధిష్టానం ఆదేశాలతో నియోజవర్గ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు రామయ్య వివరణ ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందని నాయకులు, కార్యకర్తలు కొలికపూడి మాకొద్దు అంటూ గట్టిగా అనడంతో సమావేశం కొద్దిసేపు గందరగోళంగా మారింది. ఈ క్రమంలో రామయ్య జోక్యం చేసుకుని ఎమ్మెల్యే స్వతంత్ర నిర్ణయాలు తీసుకోకుండా సమిష్టి నిర్ణయం తీసుకునేందుకు నియోజకవర్గంలోని ఐదుగురు ముఖ్య నేతలతో కమిటీ ఏర్పాటు చేసే విధంగా అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అయితే ఆ కమిటీ వేసిన తర్వాతే నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని, అప్పటి వరకు ఎమ్మెల్యే వేదిక మీద ఉండే సమావేశానికి హాజరుకాబోమని చెప్పారు. ఎంపి చిన్ని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేపై నాయకులు, జర్నలిస్టులు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించి సానుకూలంగా స్పందించారన్నారు. సమస్య పెద్దది కాకుండా ఉండేందుకు నియోజకవర్గ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ ఎమ్మెల్యే పట్ల అసంతృప్తి ఉన్న నేతలు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్తు, నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు, వాసం మునియ్య, మానికొండ రామకృష్ణ, గువ్వల వెంకటేశ్వరరెడ్డి, సంకర కృష్ణమోహనరావు, దాడి హనుమంతరావు, డాబా శ్రీనివాసరావు, వల్లభనేని గిరి, అలవాల రమేష్‌రెడ్డి, పార్వతం శ్రీనివాసరావు, వై.పుల్లయ్య చౌదరి, ఎన్.శ్రీనివాసరావు, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చిట్టేల సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు నియోజవర్గ స్థాయి సమావేశానికి వెళ్లకుండా ఆయన ఇంటి వద్ద తిరువూరు మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రోజంతా గడిపారు.

నాయకులతో మాట్లాడుతున్న వర్ల రామయ్య

మొదటిపేజీ తరువాయి

టమాటా ధర దిగొచ్చేనా !

పద్ధతిపైన వినియోగదారులకు అందిస్తోంది. తొలివిడతగా జిల్లాలోని పది రైతు బజార్లకు 10 టన్నుల టమాటాలను సరఫరా చేస్తోంది. అయితే ప్రభుత్వం ఎటువంటి రాయితీ ఇవ్వకపోవడంతో వీటి ధరల్లో ఏ మేరకు తగ్గుదల ఉంటుందనేది మార్కెటింగ్ శాఖ సరఫరా చేస్తున్న టమాటాలు రైతు బజార్లకు చేరిన తర్వాత మాత్రమే తెలుస్తుంది.

వినియోగంపై ప్రభావం!

జిల్లాలో మొత్తం పది రైతు బజార్లున్నాయి. జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని రెండు రైతు బజార్లలో 20 క్వింటాళ్లు, గుడివాడలో 20, పెడనలో మూడు, చల్లపల్లిలో రెండు, కూచిపూడిలో రెండు, పామర్రు రెండు, ఉయ్యూరు మూడు, కంకిపాడు మూడు, గన్నవరం మూడు క్వింటాళ్లు చొప్పున మొత్తం 58 క్వింటాళ్ల టమోటాలు రోజువారీ విక్రయాలు జరుగుతాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ 15 వరకు సగటున కిలో రూ. 25కు వినియోగదారులకు లభ్యమైంది. అయితే గత నెల 29వ తేదీన కిలో రూ.46 ఉన్న టమాటా 30న రూ.49కి ఈ నెల ఒకటిన రూ.56కు చేరింది. గత ఐదు రోజుల నుంచి రైతు బజారుల్లోనే రూ.71కు విక్రయిస్తున్నారు. ధరలు అనూహ్యంగా పెరగడంతో టమాటా పేరెత్తితేనే వినియోగదారులు హడలిపోతున్నారు. దీంతో రైతు బజారుల్లో టమాటా వినియోగం రోజుకు 56 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్లకు పడిపోయింది.

భారీ వర్షాలు, వరదలతో పంటకు దెబ్బ

కృష్ణాజిల్లాలోని నదీ పరివాహక ప్రాంతాలు, లంక భూములు, ఎన్‌టిఆర్ జిల్లాలో నీరు నిల్వ ఉండని మెట్ట భూముల్లో వర్షాకాలంలోనూ, వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయలు, టమాటా తోటలు సాగు చేస్తారు. ఇటీవల వచ్చిన వరదలు, భారీ వర్షాలకు టమాటా తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో స్థానికంగా టమాటా లభ్యత తగ్గిపోయింది. మార్కెట్ డిమాండ్‌కు తగిన విధంగా అందుబాటులో లేకపోవడంతో ధరలు అనూహ్యంగా పెరిగాయని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

నేటి నుంచి నో లాస్ నో ప్రాఫిట్ పద్ధతిలో విక్రయాలు

షేక్ అమీర్‌బాషా, ఎస్టేట్ ఆఫీసర్, రైతు బజారు, మచిలీపట్నం

మార్కెటింగ్ శాఖ టమాటాలను నేరుగా రైతుల నుంచి సేకరిస్తోంది. నో ప్రాఫిట్, నో లాస్ పద్ధతిలో వీటిని వినియోగదారులకు అందిస్తోంది. సోమవారం నుంచి ఈ టమాటాలు రైతు బజారుల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. దీంతో టమాటా ధరలు కొంత మేర తగ్గుతాయి.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL JUNIOR CIVIL JUDGE – CUM-VII ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGA REDDY DISTRICT, AT:HAYATHNAGAR
O.S.No: 134 of 2023
Between:
Allada Veera Satish Kumar & others ..Plaintiffs
And
Smt. Allada Nagamani & others ...Defendants
To
Smt. Allada Nagamani, W/o. Narasimha Rao, R/o. H.No.16-499, Machavaram, Chilakalapudi Post, Machilipatnam, Krishna District.
(Defendant No.1)
Please take notice that the PLAINTIFF HAS FILED THE ABOVE SUIT AGAINST YOU FOR DECLARATION AND ANCELLATION OF DOCUMENTS. Whereas in the said Suit, summons were sent to you through process of Court and through R.P.A.D, but could not be served upon you as the same were returned unserved. Therefore as per Orders of the Honourable Court, this notice is published, the said Suit stands posted on **30-10-2024** for your appearance in the said court at 10.30 A.m. and in case you do not appear either in person or through an Advocate, the said suit will be heard and decided in your absence setting you exparte.
(By Order Of The Court)
M/s. K.RAMANJANEYULU
&
Associates
ADVOCATES
Flat no.305, Raghava Towers,
Opposite Archana Hospital,
Madinaguda, Hyderabad-49

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL JUNIOR CIVIL JUDGE – CUM-VII ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGA REDDY DISTRICT, AT: HAYATHNAGAR
I.A.No. 148 of 2023
In
O.S.No: 134 of 2023
Between:
Allada Veera Satish Kumar & others ...Petitioners/Plaintiffs
And
Smt. Allada Nagamani & others ...Respondents/Defendants
To
Smt. Allada Nagamani, W/o. Narasimha Rao, R/o. H.No.16-499, Machavaram, Chilakalapudi Post, Machilipatnam, Krishna District.
(Respondent no.1)
Please take notice that the etitioners/ Plaintiffs have filed the above application against you seeking temporary injunction restraining you for interfering in the peaceful possession of the suit schedule property. Whereas in the said application, notices sent to you through process of Court and through R.P.A.D, could not be served upon you as the same were returned unserved. Therefore as per Orders of the Honourable Court, this notice is published, the said application stands posted on **30-10-2024** for your appearance in the above court at 10.30 A.m. and in case you do not appear either in person or through an Advocate the petition will be heard and decided in your absence setting you exparte.
(By Order Of The Court)
M/s. K.RAMANJANEYULU
&
Associates
ADVOCATES
Flat no.305, Raghava Towers,
Opposite Archana Hospital,
Madinaguda, Hyderabad-49

కేసరపల్లిలో సైబర్ మోసం

- రూ. ఐదు లక్షలు వస్తాయని చెప్పి రూ.20 వేలు కొట్టేసిన వైనం

శివశంకర్ (బాధితుడు)

ప్రజాశక్తి-గన్నవరం : హలో.. శివశంకర్ గారేనా.. మేం విజయవాడ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం. మీకు ప్రధానమంత్రి లోన్ రూ.5,00,000 మంజూరు అయింది. వెంటనే మీ బ్యాంకు పాస్ పుస్తకం, జిరాక్స్, ఆధార జిరాక్స్ పెట్టండి. ముందుగా నా అకౌంట్ కి రూ.15 వేలు ట్రాన్స్ ఫర్ చేయండి. ఒక్కరోజులో ఐదు లక్షలు మీ అకౌంట్లో జమ అవుతుంది. ఈ మాటలు విన్న శివశంకర్.. కష్టాల్లో ఉన్నాం కదా.. రూ.5 లక్షలు వస్తాయనే నమ్మకంతో.. అతను చెప్పిన నెంబర్‌కు వెంటనే డబ్బులు పంపారు.. రెండో రోజు ఆ నెంబర్ కి ఫోన్ చేశాడు శివ శంకర్. ఇంకా లోన్ డబ్బులు పడలేదు ఏంటి అని అడిగాడు. చిన్న ఇబ్బంది వచ్చింది మరో ఐదు వేల రూపాయలు నేను చెప్పిన నెంబర్‌కు పంపండి. వెంటనే 5 లక్షలు మీ అకౌంట్లో జమ చేస్తాడు అని నమ్మబలికాడు. వెంటనే ఐదు వేల రూపాయలు పంపాడు. అంతే అప్పటి నుంచి రెండు నెలలు అయినా లోన్ డబ్బులు రాలేదు. ఫోన్ చేసిన వ్యక్తులు ఫోన్ తీయడం మానేశారు. ఇలాంటి సైబర్ మోసం గన్నవరం మండలం కేసరపల్లిలో వెలుగు చూసింది.

వివరాల్లోకి వెళితే... గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన నేరుసు శివ శంకర్ అనే వ్యక్తి ఫోన్ నెంబర్ ను సేకరించి ఆగస్టు 10వ తేదీన ఫోన్ చేశారు. నాపేరు ఎన్ కె నాయుడు అని, విజయవాడ బ్యాంక్ నుంచి చేస్తున్నామని.. మీకు ప్రధానమంత్రి స్కీం కింద రుణం ఐదు లక్షల వచ్చిందని శివశంకర్‌కు చెప్పాడు. అతని ఫోన్ నెంబర్ 8826868429. ఈ నెంబర్‌తో రెండుసార్లు ఫోన్ చేసి రుణం కావాలంటే ముందు రూ. 15,000 పంపించమని చెప్పాడు. అతని మాటలు వింటే డబ్బులు ఎకౌంట్లో పడిపోయినట్టే అన్న విధంగా చెప్పడంతో నమ్మిన శివశంకర్ రూ. 15,000 అప్పు చేసి మరీ అతనికి పంపాడు. ఆ తర్వాత రెండు రోజులకు రుణం రాకపోవడంతో ఫోన్ చేయగా, చిన్న ఇబ్బంది వచ్చిందనీ, 7981196976కు మరో ఐదు వేలు పంపితే వెంటనే మీ అకౌంట్లో 5 లక్షల రూపాయలు పడిపోతాయని చెప్పాడు. అంతే శంకర్ ఆలోచించకుండా ఐదు వేల రూపాయలు ఆ నెంబర్ కు పంపేశాడు. ఇది జరిగి రెండు నెలలు అవుతున్నా ఇంతవరకు రుణం రాలేదు. సదరు వ్యక్తులు ఫోన్లు తీయడం మానేశారు. ఈ విషయాన్ని తన స్నేహితులకు చెప్పగా ఎవరో తెలివిగా నిన్ను మోసం చేశారని చెప్పడంతో విని ఆవేదనకు లోనయ్యాడు శివశంకర్. ఇలాంటి సైబర్ మోసాలు ఎన్నో జరుగుతున్నాయి. ఐదు లక్షలు రుణం వస్తుందంటే ఎక్కడ నుంచి వస్తుందనే వివరాల్లోకి వెళ్లకుండా డబ్బులు పంపించి మోసపోవాల్సి వచ్చిందని చెప్పాడు. సైబర్ మోసాల్లో... ఇదొక మోసంగా చెబుతున్నారు. అస్సాం, గుజరాత్, బీహార్ ప్రాంతాలకు చెందిన సైబర్ నేరగాళ్లు మన ఫోన్ నెంబర్లను యాక్ చేసి లోన్లు ఇస్తామని డబ్బులు దండుకుంటున్నారు. ఇప్పటికైనా యువకులు మేలుకొని ఇలాంటి మోసాల బారిన పడొద్దని కోరుతున్నారు.

అర్ధరాత్రి ఇంట్లోకి వెళ్లిన యువకుడికి దేహశుద్ధి

ప్రజాశక్తి-గన్నవరం : అర్ధరాత్రి ఓ బాలిక ఇంట్లోకి ప్రవేశించిన యువకుడికి దేహశుద్ధి చేసి కట్టి వేసిన సంఘటన గన్నవరం మండలం సూరంపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. గన్నవరం పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదని యువకులు చెప్పారు. అయితే దసరా విధుల్లో అందరూ ఉండటం వల్ల స్పందించలేదని పోలీసుల వాదన. అయితే ఆదివారం వైరీవర్గాలను పోలీస్ స్టేషన్ కు తీసుకు వచ్చారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే.. ఆ గ్రామంలోని సగరుల పేటకు చెందిన గుర్రం శ్రీకాంత్ డీజే లు పెడుతూ వచ్చిన డబ్బులతో హడావిడి చేస్తుంటాడు. అదే గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో ఆకర్షించాడు. తల్లి లేని ఆ బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి వేళ ఆ బాలిక ఇంట్లోకి శ్రీకాంత్ వెళ్లగా పక్కనే ఉన్న బంధువులు గమనించి పట్టుకున్నారు. కుర్రాళ్ళు అతనికి దేహశుద్ధి చేసి తాళ్లతో కట్టివేశారు. ఈ విషయం బయటకు తెలియడంతో రాత్రి వేళలో రెండు కుటుంబాల వాళ్ళ, వారి బంధువులు అక్కడికి చేరి శ్రీకాంత్ ను విడిపించారు. కులాలు వేరు కావడంతో శ్రీకాంత్ తల్లిదండ్రులు పెళ్ళికి ఒప్పుకోవడం లేదని చెప్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ బివి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై ప్రేమ్ కుమార్ కేసు విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా తాము ఏడాది క్రితం నుంచి ప్రేమించు కుంటున్నామని, శ్రీకాంత్, మైనర్ బాలిక చెప్పడం గమనార్హం. అర్ధరాత్రి గొడవ జరిగిన తర్వాత శ్రీకాంత్ తాను ప్రేమించిన బాలిక మెడలో తాళి కట్టడం జరిగిందని గ్రామస్తులు చెప్పారు. దీనిపైన పోలీసులు విచారిస్తున్నారు.

లయన్స్ ఇంటర్నేషనల్‌కు విరాళం

ప్రజాశక్తి-ఉయ్యూరు : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థకు క్లబ్ జోన్ చైర్మన్ ఎండి ఇస్మాయిల్ రూ. 84,500 విరాళంగా అందచేశారు. విజయవాడ సిటీ సైడ్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన జోన్మీట్లో చెక్కును లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి, జిల్లా ప్రతినిధులకు ఇస్మాయిల్ అందచేశారు. జిల్లా క్యాబెనెట్ డిప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివ రావు తదితరులు పాల్గొని ఇస్మాయిల్ ను అభినందించారు.

చెక్కు అందజేస్తున్న జోన్ చైర్మన్ ఎండి ఇస్మాయిల్

రేపు అవనిగడ్డలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పన శాఖ డీఆర్డీఏ సి డాప్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి పి సురేష్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి తెలిపారు. ఈ జాబ్ మేళాలో టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ముత్తూట్ మనీ లిమిటెడ్ నవత రోడ్డు ట్రాన్స్పోర్ట్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కంపెనీలలో కల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాలలోపు వయసుగల వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు పదివేల నుండి 18 వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన సౌకర్యాలున్నాయన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగా హెచ్ టి టి పి ఎస్/ టి ఐ ఎన్ యు ఆర్ ఐ కం/ జాబ్ మేళా ఏవిజిఏలి లింకులో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి జాబ్ మేళాకు రెజ్యూమ్‌లతో లేదా బయోడేటా ఫారంలతో పాటు ఆధార్ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో రావాలని కోరారు. ఇతర వివరాలకు 6300618985 లేదా 7995 5345 72 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ఎస్‌విఎల్ క్రాంతి కళాశాలలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కళాశాలలోని మహిళా సిబ్బంది విద్యార్థినులతో కలసి రకరకాల పువ్వులు సేకరించి బతుకమ్మలు పేర్చి ఊరేగించారు. అనంతరం సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా విద్య నికేతన్ పాఠశాలలో కూడా దసరా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఉండ్రాజు లంకమ్మ ప్రసాద్ ఆధ్వర్యంలో సాంస్కతిక భారతీయ నత్య ఖ్యాతి ఉట్టిపడేలా విద్యార్థుల చేత నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయగా ఆ ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

పూలతో బతుకమ్మలు పేర్చి ఊరేగిస్తున్న విద్యార్థినిలు

కొనసాగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి - గుడివాడ : విజయదశమిని పురస్కరిం చుకుని శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు 4వ రోజు ఆదివారం అమ్మవారి దేవాలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. స్థానిక బంటుమిల్లి రోడ్‌లో ఉన్న శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీ దేవి శరన్నవరాత్ర మహెూత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమి చ్చారు. కార్యనిర్వహణాధికారి గోపాలరావు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం శ్రీమహాగౌరిదేవిగా భక్తులకు దర్శినమిచ్చారు. గుడివాడలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో శ్రీసంతానలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెవి గోపాలరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామం వద్ద ఆదివారం తెల్లవారు జామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకున్నట్టు ఎస్సై వైవివి సత్యనారాయణ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ కే. కొత్తపాలెం నుండి మచిలీపట్నానికి ఎలాంటి రసీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పెదప్రోలు వద్ద అదుపులకు తీసుకొని, స్టేషను తరలించినట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం మోపిదేవి తాసిల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు. మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక, బుసక మట్టి త్రవ్వకాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-ఘంటసాల : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో 10 ఎకరాల వరి గడ్డివామి దగ్ధమైంది. అవనిగడ్డ అగ్నిమాపక శాఖ వారు తెలిపిన వివరాల ప్రకారం ఘంటసాల గ్రామంలోని ఘోటకం ఏ కాలనీ (జామియా మసీదు సమీపం)లోని గాజుల శివ వెంకటేశ్వరరావు చెందిన వరిగడ్డివామికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం ఆదివారం మద్యాహ్నం నిప్పంటుకుంది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే అవనిగడ్డ అగ్నిమాపక శాఖకు సమాచారం అందించటంతో అగ్నిమాపక శాఖ ఇంచార్జ్ అధికారి బి.బాలమురళీకష్ణ పర్యవేక్షణలో సిబ్బంది సంఘటనా ప్రాంతానికి వచ్చి మంటలను అదుపు చేశారు. మొత్తం 10 ఎకరాల వరి గడ్డివామి దగ్ధం కాగా, రూ.1.30 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాలమురళీకష్ణ తెలిపారు. ఒక పూరిల్లు, గడ్డివామి దగ్ధం కాకుండా కాపాడినట్లు ఆయన తెలిపారు.

కోడిపందేల నిర్వాహకులు అరెస్టు

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో పామర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుభాకర్ ఆధ్వర్యంలో కూచిపూడి ఎస్సై సుబ్రహ్మణ్యంకి వచ్చిన సమాచారంతో వారి సిబ్బందితో కలసి వేములమడ గ్రామ శివారు డొంకలో కోడిపందేలు వేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 6730 నగదు, ఒక కోడి స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై కఠిన మైనా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మోపిదేవి మండల టిడిపి అధ్యక్షులు నడకుదుటి జనార్దన్‌రావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్ద నిర్వహించారు. జనార్దన్ రావు కేక్ కట్ చేయగా బుద్ధ ప్రసాద్ కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనార్ధరావుకు శాలువా కప్పి ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, బం డే రాఘవ, ఘంటసాల రాజమోహన్రావు, కొల్లూరి వాసు, చంద్ర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

శ్రీ లలితా త్రిపురసుందరీ దేవిగా దుర్గమ్మ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన ఆదివారం ఆశ్వయుజ శుద్ధ చవితి నాడు ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ లలితత్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చింది. ఆదివారం సెలవు కావటంతో దుర్గమ్మను దర్శించు కునేందుకు యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజాము నుండే యాత్రికులతో క్యూలైన్లు నిండిపోయాయి. వినాయకుని గుడి వద్ద నుండి ఏర్పాటు చేసిన మూడు క్యూ లైన్ల ద్వారా యాత్రికులు ఇంద్రకీలాద్రి కొండపైకి చేరుకుని శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించు కున్నారు. శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకునేందుకు నగరం నుంచే గాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుండి యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఏ క్యూలైను చూసినా యాత్రికులతో ఫుల్‌గా నిండిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ రోజు సుమారు లక్ష మందికి పైగా శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించు కున్నారు. ఇక రానున్న రోజులు భారీ సంఖ్యలో భక్తులు దుర్గమ్మ ఆలయానికి తరలి వచ్చే అవకాశాలు మెండుగా వున్నాయి. ఈనెల 9వ తేదీ ఆశ్వయుజ శుద్ధ షష్ఠి / సప్తమి బుధవారం మూలానక్షత్రం రోజున సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనం ఇవ్వనుండటంతో ఆరోజు మూడు లక్షలకు పైగా అమ్మవారి దర్శనం చేసుకుంటారని దేవాలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికోసం దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడి కక్కడ మెష్‌లతో ఆలయ ప్రాంగణాన్ని మూసివేసి కట్టు దిట్టం చేస్తున్నారు. దసరా పండుగ విజయదశమి దగ్గర పడుతుం డటంతో పాఠశాలలకు, కళాశాలలకు సెలవు దినాలు కావటంతో పక్క రాష్ట్రాలైన విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి యాత్రికులతో పాటు భవానీమాలధారులురానున్నారు.

క్యూలైన్లో దర్శనానికి వెళ్తున్న యాత్రికులు

మహామండపం ఆరవ అంతస్తులో కుంకుమ పూజలు :
మహామండపం ఆరవ అంతస్తులో ప్రతిరోజూ కుంకుమ పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ముందుగా కుంకుమ పూజకు రూ. 3,000 చెల్లించి పూజల్లో పాల్గొనాల్సి ఉంటుంది.

దుర్గగుడి కళావేదికపై అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు :
మహామండపం వైపున గల ఖాళీ స్థలంలో ఏర్పాటుచేసిన కళా వేదికపై నిర్వహి స్తున్న సాం స్కృతిక కార్యక్రమాలు అల రిస్తున్నాయి. భరత నాట్యం, కూచి పూడి వంటి నృత్యాలతో కళాకా రులు ఆకట్టుకుం టున్నారు. అలాగే దేవాలయంలో ఉత్స వాల నేపథ్యంలో డప్పుకళాకారులు వాయిద్యాలతో ఆకట్టుకుంటున్నాయి.

నేడు శ్రీ మహాచండీ దేవి అలంకారంలో దుర్గమ్మ :
ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్స వాలలో భాగంగా ఐదో రోజు సోమవారం శ్రీ మహాచండీ దేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనం ఇవ్వనున్నారు.

టికెట్ల ద్వారా ఆదాయం రూ. 69,75,567

శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల సందర్భంగా నాల్గవ రోజు ఆదివారం దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల అమ్మకం, కుంకుమ పూజలకు సంబంధించి శనివారం సాయంత్రం 5 గంటల వరకూ దేవాలయానికి మొత్తం రూ. 69,75,567లు ఆదాయం లభించింది. రూ. 500 టిక్కెట్లు 5764కు గాను రూ. 28,82,000లు, రూ.300ల టిక్కెట్లు 2957కు గాను రూ. 8,87,100లు, రూ. 100ల టిక్కెట్లు 5395 కు గాను రూ. 5,39,500లు, లడ్డూ ప్రసాదం ఒకటి రూ. 15ల చొప్పున 20591 లడ్డూలకు గాను రూ. 3,08,865లు, ఆరు లడ్డూల ప్రసాదం ప్యాక్ రూ. 100ల చొప్పున 114576 లడ్డూలకు గానూ రూ. 19,09,600లు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనకు రూ. 3,000 చొప్పున 20 టిక్కెట్లకు గాను రూ,60,000లు, కుంకుమార్చన (సరస్వతి అలంకరణ) రూ. 5000 చొప్పున ఒక టిక్కెట్‌కు గానూ రూ.5,000, పరోక్ష ప్రత్యేక చండీహోమం రూ. 4వేలు చొప్పున 3 టిక్కెట్లకు గానూ రూ. 12వేలు, పరోక్ష ప్రత్యేక ఖడ్గమాలార్చన రూ.5,116లు చొప్పున ఏడు టిక్కెట్లక గానూ రూ. 35,812, ఫొటోలు, క్యాలెండర్స్‌కు రూ.2,330లు, హుండీ, డొనేషన్ల రూపంలో రూ. 2,18,730లు, కేశఖండన టిక్కెట్ రూ. 40ల చొప్పున 2862 టిక్కెట్లకు గాను రూ. 1,14,480లు ఆదాయం సమకూరింది. దీంతో మొత్తం రూ. 69,75,567లు ఆదాయం సమకూరినట్లు దుర్గగుడి అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటన ద్వారా తెలిపారు.

చిట్టినగర్ అమ్మవారి దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దసరా మహోత్సవంలో భాగంగా నాల్గో రోజు ఆదివారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంతో యాత్రికులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, గౌరవాధ్యక్షులు బెవర సూర్యనారాయణ మాట్లాడుతూ యాత్రికులు, వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుంటున్నారన్నారు. దసరా సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిలో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాలకు ఆదరణ లభిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్ (రాజా), శీరం వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు మజ్జి ఈశ్వరరావు, తొత్తడి భరత్ కుమార్, పోతిన వెంకట ధర్మారావు, గూడేల రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా అమ్మవార్ల నగరోత్సవం

ప్రజాశక్తి, వన్‌టౌన్, విజయవాడ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నాల్గవ రోజు ఆదివారం అమ్మవారు శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి అవతారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై స్వామి అమ్మవార్ల నగరోత్సవం వైభవోపేతంగా జరిగింది. మేళతాళాలు, సంప్రదాయ నత్యాలు, కోలాటం నడుమ నగరోత్సవం సాగింది. శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకత అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్త జనుల జయ జయ ధ్వానాల మధ్య నగర ఉత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : స్థానిక ఎస్‌సి ఏరియాలో రెండు కాళ్లూ పనిచేయని చింతిరాల మరియమ్మ కుమారుడు శివకు ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి (పెద్దోడు) రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ఎంఎల్‌ఎ వసంత కృష్ణప్రసాద్ సైన్యం, విజయబాబు సూచన మేరకు అందించారు. ఈ కార్యక్రమంలో మాతంగి రామారావు, ఉయ్యూరు ప్రణయ్ కుమార్ రెడ్డి, చాట్ల అచ్చయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

శ్రీ వీరబాబు స్వామిని దర్శించుకున్న ఎంపి

ప్రసాదం అందుకుంటున్న ఎంపి చిన్ని

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదివారం తమ్ముల పల్లి కళాక్షేత్రం వెనుక శ్రీ వీరబాబు స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం కమిటీ సభ్యులు, పండితులు ఆయనకు స్వాగతం పలికారు. దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయంలో నెలకొల్పిన అమ్మవారిని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవిగా దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన తిలకించి నృత్యకళాకారులను అభినందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో అన్న ప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వీరబాబు స్వామి దేవస్థానం అధ్యక్షుడు కొమ్మూరు బసవరాజు, ప్రధాన కార్యదర్శి గొంట్లా రామమోహనరావు, కోశాధికారి కొప్పరపు వీరబాబు, ఉప కోశాధికారి బచ్చుల వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

వేర్పాటువాదానికి దారితీస్తుంది: వర్మ - ప్రాంతీయ ప్రాధాన్యతలు తగ్గుతాయి: దివాకర్ బాబు

ప్రజాశక్తి-విజయవాడ : భారతదేశంలో విభిన్న కులాలు, మతాలు, భాషలు, వాతావరణ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పలువురు వ్యక్తులు స్పష్టం చేశారు. ప్రోగ్రెసివ్ ఫోరం విజయవాడ వారి ఆధ్వర్యంలో 'జమిలి ఎన్నికలు–పర్యవసానాలు' అంశంపై సదస్సు జరిగింది. స్థానిక గవర్నర్‌పేట బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ఆదివారం జరిగింది. సదస్సులో దారిదీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మౌలిక సమస్యల పరిష్కారంలో విఫలం కావటం, ఆర్థిక పాలన సంక్షోభం, అభివృద్ధిలో వైఫల్యం కారణంగా ఒకే దేశం, ఒకే ప్రజ అనే నినాదంతో మెజార్టీ మతవాదాన్ని సాధించటానికి దేశంలో వైరుధ్యం తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న చోట ప్రాంతీయ సమస్యలు పరిష్కారం కావన్నారు. తద్వారా ప్రాంతీయ పార్టీలు అపహాస్యానికి గురై వేర్పాటు వాదానికి దారితీస్తే ప్రమాదం ఉందన్నారు. మరో వక్త సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకర్ బాబు ప్రసంగిస్తూ జమిలి ఎన్నికల కోసం ఎన్నికల సంఘం దేశంలోని రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని చెప్పిన ప్రధాని మోదీ దానికి విరుద్ధంగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ నేతృత్వంలో కమిటీ వేశారని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ధన బలంతో రాష్ట్ర ప్రభుత్వాలను పడేసిందన్నారు. 2026 నాటికి దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాలు తగ్గుతాయని చెప్పారు. ఈ సదస్సుకి ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యుడు బి.జమిందార్ అధ్యక్షత వహించారు. తొలుత అతిథులకు ఫోరం నాయకులు తాజారావు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి వామపక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధిత రైతులందరికీ సాయం

- పారదర్శకంగా ఎన్యుమరేషన్
- 58,142 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- 38,390 మంది బాధిత రైతులు
- 45 వేల ఎకరాల్లో ఇసుక మేట
- వ్యవసాయ జె.డి నాగమణెమ్మ

ప్రజాశక్తి-విజయవాడ : వరదల్లో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం, అధికారులు కృషి చేస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా వ్యవసాయాధికారి (జె.డి) ఎస్ నాగమణెమ్మ తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి, సక్రమంగా ఎన్యుమరేషన్ చేసి, పారదర్శక పద్ధతిలో రైతులకు సాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ సాయం పంపిణీ ఇప్పటికే గ్రామాల్లో దాదాపుగా పూర్తి అయ్యే దశకు వచ్చిందని అన్నారు. గత నెలలో వచ్చిన వరదలకు ఎన్‌టిఆర్ జిల్లాలో 38,390 మంది రైతులకు సంబందించిన 58,142 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని అన్నారు.

1,17,500 ఎకరాల్లో వ్యవసాయ భూమి కోతకు గురికాగా, 45 వేల ఎకరాల్లో ఇసుక మేట వేసిందని అన్నారు. జిల్లాలో మొత్తం 2,43,350 ఎకరాల్లో వివిధ రకాల వ్యవసాయ పంటలు సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2,09, 892 ఎకరాల్లో పంటలు వేశారన్నారు. 186 మంది రైతులకు సంబందించిన 255 ఎకరాల్లోని వ్యవసాయ భూమిలో ఇసుక మేట వేసింది. దీనిని తొలగింపుకు రూ. 47 లక్షల మేర ఖర్చు అవుతుంది. జగ్గయ్య పేటు, పెనుగం చిప్రోలు, గంపలగూడెం, వత్సవాయి తదితర మండలాల్లోని గ్రామాల భూముల్లో ఇసుక మేట వేసింది. ఇంత భారీ స్థాయిలో పంట నష్టం ఇటీవల కాలంలో ఏనాడు జరగలేదన్నారు. జిల్లాలో దెబ్బతిన్న పంటలు, రైతుల పరిస్తితి తదితర అంశాలపై జె.డి నాగమణెమ్మ ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: ఎన్‌టిఆర్ జిల్లాలో ఏఏ పంటలు ఎన్ని ఎకరాల్లో దెబ్బతిన్నాయి?

భారీ వర్షాలు, వరదలకు జిల్లాలోసాగు చేసిన వివిధ రకాల పంటల్లో ..వరి పంట 32,872 ఎకరాల్లో దెబ్బతిన్నది. మొత్తం 62,500 ఎకరాల్లో వరి సాగు అయింది. అలాగే పత్తి పంట 17,295 ఎకరాల్లో దెబ్బతినగా, ఈ పంట మొత్తం 62 వేల ఎకరాల్లో సాగయింది. అలాగే పెసర పంట 2,760 ఎకరాల్లో దెబ్బతినగా, మొత్తం 37,500 ఎకరాల్లో పంట వేశారు. మినుము 2,435 ఎకరాల్లో దెబ్బతింటే...37వేల ఎకరాల్లో సాగు చేశారు. మొక్క జొన్న 37 వేల ఎకరాల్లో సాగు చేయగా, 2,337 ఎకరాల్లో పంట దెబ్బతిన్నది.

ప్రశ్న: మొత్తం జిల్లాలో ఎంత మంది రైతులకు, ఎంత నష్టం వాటిల్లింది?

ఎన్‌టిఆర్ జిల్లాలో సాగు చేసిన 38, 390 మంది రైతులకు రూ. 55 కోట్లు నష్టం వాటిల్లింది.

ప్రశ్న: దెబ్బతిన్న పంటల స్థానంలో ఏఏ పంటలు సాగు చేస్తున్నారు...?

దెబ్బతిన్న వివిధ రకాల పంటల స్థానంలో రైతులు మరలా పంట సాగు చేసుకుంటున్నారు. వారికి వివిధ రూపాల్లో ప్రభుత్వం సాయం అందిస్తుంది. జగ్గయ్యపేట ఏరియాల్లో నాట్లు మరలా వేస్తున్నారు. అలాగే మొజక్కజొన్న, శనగ పంట సాగు చేస్తున్నారు. కాటన్ పంట కూడా వేస్తున్నారు. ఈ పంటలకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తన సప్లై చేస్తుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. నందిగామ, వత్సవాయి, విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, జి కొడూరు, జగ్గయ్యపేట తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో పంటలను తిరిగి సాగు చేస్తున్నారు.

ప్రశ్న:రైతుల్లో వ్యవసాయ పంటల సాగుపై అవగాహన కల్పించడానికి జిల్లాలో నడుస్తున్న కార్యక్రమాలు?

వ్యవసాయ సాగు దాని మెళుకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రస్తుతం వరదల అనంతరం తీసుకోవాల్సిన సశ్యరక్షణ చర్యలు తదితర అంశాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ నిర్ణయించిన "పొలం పిలుస్తుంది" కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నాం. వారంలో రెండు రోజులు (మంగళ, బుధ) పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, సేంద్రీయ ఎరువుల వాడకం, రసాయనిక ఎరువుల వాడకం తగ్గింపు, పెట్టుబడులు, పంటల మార్పిడీ, భూసార పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తాం.

అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనం

అన్నసమారాధనకు స్థలం పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో భాగంగా శ్రీ కాశీ అన్నపూర్ణ దేవి అలంకారంతో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. సహస్రనామ కుంకుమార్చన, మూలమంత్ర హవనములు, హోమం అత్యంత వైభవంగా జరిగాయి. రాజమహేంద్రం వారిచే శ్రీ బాల రాజేశ్వరి కూచిపూడి నత్య ప్రదర్శన నిర్వహించారు. గత కార్యనిర్వాహణాధికారి కానూరి సురేష్ బాబు దంపతులు, గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని పట్టు వస్త్రాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఈనెల 10వ తేదీ గురువారం జరగబోయే భారీ అన్న సమారాధన కార్యక్రమానికి ఏర్పాట్లను పరిశీలించారు

నేడు కలెక్టరేట్లో 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం జరుగు తుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు..

మాధవికి డొక్కా సీతమ్మ స్ఫూర్తి పురస్కారం

ప్రజాశక్తి-గన్నవరం : పది సంవత్సరాలుగా అనాధ వద్దుల, బాలలకు అందిస్తున్న సేవలకు గాను గన్నవరం బికేఆర్ సేవా సంస్థల చైర్మన్ కానూరి శేషు మాధవి కి అరుదైన పురస్కారం లభించింది. కాకినాడలో "వర్ణ ధార హెల్త్ ఆర్గనైజేషన్" వారి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమెకు "డొక్కా సీతమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని" ఫిలాంత్రోఫీ సొసైటీ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ అద్దంకి రాజా, ఎమ్మెల్సీ కర్రీ పద్మలు బహుకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న సూపరెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ కొండా నరసింహ రావు, పలువురు శేషు మాధవికి అభినందనలు తెలియజేశారు.

మాధవికి పురస్కారం అందిస్తున్న దృశ్యం

రావెళ్ల ఫౌండేషన్ ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-చల్లపల్లి : రెండు కిడ్నీలు దెబ్బతిని డయాలసిస్ చేయించుకుంటున్న చల్లపల్లి నారాయణ రావు నగర్‌కు చెందిన సుభానీకి రావెళ్ళ ఫౌండేషన్ తరుపున ఫౌండేషన్ చైర్మన్ రావెళ్ళ ఉదయ్ కుమార్ రూ. 25 వేల ఆర్థిక సాయం ఆదివారం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పరుచూరి సురేష్ బాబు, మోర్ల శివ, నిడమానూరి శ్రీకాంత్, కొల్లి హర్ష, ఉరిమి విశ్వానాథ్ పాల్గొన్నారు. విశాఖపట్నంలో ఫౌండేషన్ సభ్యులు నరసింహారావు ద్వారా క్యాన్సర్ తో బాధపడుతున్న భాగ్యలక్ష్మి కి రూ.10వేలు సాయం అందించారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కషి చేస్తున్నట్లు మహిళా పాల ఉత్పత్తిదారుల సొసైటీ అధ్యక్షురాలు బెల్లంకొండ లక్ష్మి తెలిపారు. ఆదివారం స్థానిక పాల కేంద్రంలో పాల ఉత్పత్తిదారులకు ఏడాది కాలానికి బోనస్ పంపిణీ చేశారు. 195 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.1,17,592లు బోనస్ పంపిణీ చేశారు. దీంతో పాటు పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ తమ్మన సురేష్ కుమార్, వేతన కార్యదర్శి గొరిపర్తి మురళీకష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి ఉయ్యూరు : అనారోగ్యంతో ఉన్న చలసాని వసంతకుమార్‌కు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3,42,981 చెక్కు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం అందజేశారు. టీడీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు జంపాన గుర్నాధరావు, కూనపరెడ్డి వాసు, కూటమినాయకులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని మంత్రికి వినతి

మంత్రికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పార్ట్ టైమ్, కేజీబీవీ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్ ఎన్ దేవేంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి కొల్లు రవీంద్ర ని కలసి వినతి పత్రం అందజేశారు. అలాగే రాష్ట్రంలో 25,000 మంది ఉద్యోగులు వేతనాలు సరిగ్గా రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా జీతాలు చెల్లించాలని, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దష్టికి తీసుకువెళ్లలని విజ్ఞప్తి చేశారు.అలాగే సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను విద్యా శాఖ లో విలీనం చేసి రెగ్యులర్ చెయ్యాలని హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని, అప్పటిలోగా మినిమం టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : వడ్డే ఓబన్న 178వ వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పిం చారు. ఆదివారం గుడివాడ సిఐటియు కార్యాలయంలో వడ్డే ఓబన్న ఒక స్ఫూర్తితో కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలో ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారుల సంఘం కష్ణాజిల్లా కమిటీ సభ్యులు చంద్రగిరి శివ నాగమల్లేశ్వరరావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వడ్డెర కుటుంబాలకు సంబంధించి ఆ కుటుంబాల హక్కులను సాధించుకోవాలన్నారు. వడ్డెర కుటుంబాలు అట్టడుగున పడి ఉన్నారని, వడ్డెర కులాన్ని ఎస్టీలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా మన్నారు. లేని పక్షంలో వడ్డెర కుటుంబాలను అందర్నీ ఐక్యం చేసి వడ్డెర కుటుంబాలను ఎస్టీల్లో రిజర్వేషన్లను కలిపే వరకు పోరాటాలకి సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ కార్యదర్శి బత్తుల నాగరాజు, అధ్యక్షులు ఓర్సు రాములు, సహాయ కార్యదర్శి తమ్మిశెట్టి నాగ, కమిటీ సభ్యులు చల్లా రాంబాబు, చంద్రగిరి సుబ్రహ్మణ్యం, రేపానికొండ తదితరులు పాల్గొన్నారు

అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆడియో టెక్నాలజీలో అగ్రగామిగా ఉన్న సెన్ హైజర్, ప్రైమ్, నాన్ప్రైమ్ మెంబర్లతో సహావినియోగదారులందరికీ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్లో తమ ప్రీమియం ఉత్పత్తులపై ఆకర్షణీయమైన డీల్స్ ను ప్రకటించినట్లు సంస్థ రీజనల్ ఇంఛార్జి కె . మధుసూదన రావు తెలిపారు. నగరంలోని అమెజాన్ స్టార్ నందు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యధికంగా.అమ్ముడవుతున్న సెన్హైజర్ ఉత్పత్తులపై ఎంపికచేసిన బ్యాంక్ కార్డులతో అదనపు డిస్కౌంట్లతో పాటు, 24 నెలల వరకు నోకాస్ట్ ఈఎంఐ ప్రయోజనాలను అందిస్తోంది. అన్నారు. యుఎస్‌బి మైక్రోఫోన్, మైక్రోఫోన్, హెచ్‌డి 490 ప్రో ఓపెన్ బ్యాక్ స్టూడియో హెడ్ఫోన్, ఈడబ్ల్యుడీపీ-ఎంఈ2 డిజిటల్ వైర్లెస్ మైక్రోఫోన్ సిస్టమ్, పై ఆఫర్లు ఉంటాయని అన్నారు. పాడ్ కాస్టింగ్ కోసం సెన్హైజర్ ప్రొఫైల్ స్ట్రీమింగ్ సెట్(బూమ్ ఆర్మ్) యూఎస్బీ మైక్రోఫోన్ను రూ.9999కి అందిస్తోంది. అన్నారు. మొమెంటం4(కాపర్) హెడ్ఫోన్లను రూ.19,900కి అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. మొమెంట్ ట్రూ వైర్లెస్ 4 ఇయర్ బడ్స్ ప్రత్యేక పండుగ ధరగా రూ.17,740కి అందుబాటులో ఉంచింది, వీటి అసలు ధర రూ.29,990లుగా సెన్ హైజర్ ప్రకటించిందని తెలిపారు.

పొరపాట్లు సరిచేసి వరద సాయం జమ

ప్రజాశక్తి - విజయవాడ : ఇటీవల విజయవాడ వరదల్లో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితుల్లో 21,768 మంది బాధితులు తమ బ్యాంకు ఖాతాలను తప్పుగా నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. వాటిని మళ్లీ క్షేత్రస్థాయిలో బాధితులతో తనిఖీ చేసి సరిచేశారు. ఈ బాధితులందరికీ సోమవారం సాయంత్రానికి వారందరి ఖాతాల్లోకి వరద సాయం జమ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీరి ఖాతాల్లోకి మొత్తం రూ.18,69,89,000ల సొమ్ము జమ చేయనున్నట్లు ప్రభుత్వ అధికారులు తెలిపారు. వరదల్లో నష్టపోయిన బాధిత ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తప్పనిసరిగా సాయం అందించాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చారని, ఆ ప్రకారం ప్రతి ఒక్కరికీ సాయం అందుతుందని చెప్పారు. బాధితులెవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదని వెల్లడించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ప్రజాశక్తి - మైలవరం : ప్రభుత్వ ఉపాధ్యాయులకు దసరా సందర్భంగా డిఎ, లేదా మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్షులు పి గోపాల్ డిమాండ్ చేశారు. పిఆర్‌టియు మండల శాఖ కార్యవర్గ సమావేశం ఆదివారం ఆసంఘ కార్యాలయంలో జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఎం.వెంకటేష్, ఉపాధ్యాయులు శేషగిరిరావు, సతీష్, సూరిబాబు, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్గపురికి విరాళం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) ఆధ్వర్యంలో దాతల సహాయ సహకారాలతో నిర్మించబడిన స్వర్గపురి అభివృద్ధికి దాత రూ.లక్ష విరాళం అందజేశారు. బొల్లా బేబమ్మ జ్ఞాపకార్థంగా కుమారుడు బొల్లా రాంబాబు లక్ష రూపాయల విరాళాన్ని తోసా సభ్యుల కు ఆదివారం అందజేశారు. నూతన వాహనం కొనుగోలుకు వీటిని ఉపయోగించనున్నట్లు తోసా సభ్యులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - వత్సవాయి : ప్రతి విద్యార్థి చదివిన పాఠశాలను, పుట్టిన, తల్లిదండ్రులను మరవకూడదని గ్రామ సర్పంచి చావా దుర్గారాణి అన్నారు. మండలంలోని కన్నెవీడులో జిల్లా పరిషత్ హైస్కూల్లో 1980–1985, పదో తరగతి నుండి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. బొమ్మినేని మధు అధ్యక్షతన నిర్వహించారు.

జ్వరంతో కౌన్సిలర్ మృతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి పురపాలక ఏడో వార్డు కౌన్సిలర్ కుమ్మరి నాగ సుధా కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతిచెందారు. విజయవాడ హాస్పిటల్‌కి తీసుకు వెళ్తున్న సమయంలో పరిస్థితి విషమించి ఆమె మృతిచెందారు.

ముగిసిన వెంకటరమణ అంత్యక్రియలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తెలుగుదేశం నాయకులు పిళ్లా వెంకటరమణ అంతిమయాత్ర ఆదివారం జరిగింది. గొల్లపాలెంగట్టు అరుణ కాన్వెంట్ వద్ద ఉన్న వెంకటరమణ స్వగృహం నుండి ఆయన అంతిమ యాత్ర నిర్వహించారు. విజయవాడ ఎంపి కార్యాలయ ప్రముఖులు జగన్మోహన్ రావు, వైసీపీ రాష్ట్ర నాయకులు పోతిన వెంకట మహేష్, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, బోయి సత్యబాబు, నివాళులర్పించారు. వెంకటరమణ కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

మాట్లాడుతున్న డి.వి.కృష్ణ

ప్రజాశక్తి - తిరువూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమ స్యలను పరిష్కరించ కుండా సనాతన ధర్మం పేరుతో ప్రజల మధ్యన మత విద్వేషాలను సృష్టిస్తు న్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ ఆరోపించారు. తిరువూరులో డిసెంబర్ నెలలో జరిగే జిల్లా 25వ మహాసభల నిర్వహణ నిమిత్తం ఏర్పాటు చేసిన ఆహ్వాన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ఉద్యమాలను నిర్మించడం ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పాలకులు వెంటనే విసనగడప కట్టలేరుపై బ్రిడ్జిని నిర్మించాలని, ఏ కొండూరు మండలంలో కిడ్నీ సమస్యను పరిష్కరించాలని తిరు వూరు పట్టణంలో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమ స్య, కోతుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా జిల్లా మహాసభలు ఉండాలని కోరారు. అనంతరం ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా ఎస్.నాగేశ్వరరెడ్డి, అధ్యక్షులుగా గుళ్ల పల్లి వెంకటరత్నం, కార్యదర్శిగా ఎం.నాగేంద్రప్రసాద్, కోశాధికారిగా బి.వెంకటేశ్వరరావు తదితరులతో ఆహ్వా న సంఘ కమిటీని ఏర్పాటు చేశారు. సిపిఎం విస్సన్నపే ట మండల కార్యదర్శి వి.నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎ.కొండూరు, గంపలగూడెం తిరువూరు మండలాల కార్యదర్శులు జెట్టి వెంకటేశ్వర్లురావు, గువ్వల సీతారామిరెడ్డి, సాంబార్ వెంకటేశ్వర్లు, డాక్టర్ వల్లభ నేని రవీంద్ర, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్లు మంజూరు చేయాలి

సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ : అర్హులైన పేద ప్రజలకు సామాజిక సంక్షేమ పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 100రోజులు పూర్తయినప్పటికీ సామాజిక సంక్షేమ పెన్షన్లు మంజూరు చేయడంలో ఎలాంటి చర్యలు చేపట్టక పోవటం వలన అర్హులైన పేద, మధ్యతరగతి వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆరు నెలలు సామాజిక సంక్షేమ పెన్షన్లు మంజూరు చేయలేదు, తదుపరి ఎన్నికలు కోడ్ అమలులోకి రావడం ఎన్నికల అనంతరం తెలుగుదేశం ,జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి 100 రోజులు గడిచినా పెన్షన్లు మంజూరు చేయకపోవడం వల్ల అర్హులైన వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటికే పెన్షన్ పొందుతున్న వారిని ఆరు దశల ఎంక్వయిరీ రూపంలో అర్హులైన వారి సామాజిక సంక్షేమ పెన్షన్లు అర్థాంతరంగా నిలుపుదల చేయడం వారికి మరల తిరిగి పెన్షన్లు పునరుద్ధరించకపోవడం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఎన్నికల ప్రణాళికలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ సామాజిక సంక్షేమ పెన్షన్లు వెంటనే మంజూరు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీని అమలు జరుపుటకు వెంటనే తగు చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సామాజిక సంక్షేమ పెన్షన్లు మంజూరుకు తగు చర్యలు చేపట్టకపోతే నగరంలో అర్హులైన లబ్దిదారులను సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.

కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం కావాలి

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ : కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవం సింగ్‌నగర్ 61, 62 డివిజన్లలో ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత 62వ డివిజన్ ప్రకాష్ నగర్ ఎస్సీ కాలనీలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి జెండా ఆవిష్కరించారు. కెవిపిఎస్ నాయకులు జి.రజినీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్నుద్దేశించి మాల్యాద్రి మాట్లాడుతూ కులవివక్షకు వ్యతిరేకంగా ప్రతిఘటనా పోరాటాలు జరగాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని కోరారు. ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ భారతదేశంలోనే ఉందని అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులపై, వివక్ష రూపాలను అంతమొందించేది ఐక్య పోరాటాలన్నారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవటం లేదన్నారు. ప్రజాసమస్యలను గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా సిఎం, డిప్యూటీ సిఎంలు తిరుపతి లడ్డూ, సనాతన ధర్మం చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం వచ్చిన 110రోజుల్లో ఎటువంటి మార్పు లేదన్నారు. రాజ్యాంగాన్ని కాపాడు కోవటానికి, దళితుల చట్టాలను , హక్కులను రక్షించ టానికి దళితులందరికి సమాన అవకా శాలు, సమాన హక్కులు ఉండాలని ఐక్య పోరాటాలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.నటరాజ్, సహాయ కార్యదర్శి చింతల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జి.అరుణ, స్థానికులు నాయకులు కె.సతీష్, నాగరాజు, శ్రీనివాసు జి.అమ్ములు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంటైనర్ ఢీకొని బైకిస్టు గాయాలపాలైన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పరిటాల వైపు వస్తున్న మోటార్ బైక్‌ను విజయవాడ వైపు వెళ్లే కంటైనర్ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన కొమ్మూరి వీరభద్రంకు కాలు విరిగింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : విజయవాడ రూరల్ గొల్లపూడి పరిధిలోని రాయనపాడు గ్రామంలో ఉరి వేసుకుని మందా చంద్రబాబు (50) మృతి చెందాడు. చంద్రబాబు కుమారుడు మందా కార్తీక్ అదే గ్రామానికి చెందిన మందా వెంకటేశ్వరరావుతో ఘర్షణ పడగా, వెంకటేశ్వరరావు వర్గీయులు మందా చంద్రబాబును అనుచితంగా మాట్లాడటంతో మనస్థాపానికి గురై రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మందా చంద్రబాబు ఆత్మహత్యతో రాయనపాడు టిడిపిలో ఉన్న వర్గ విభేదాలు బయటపడ్డాయి. ప్రస్తుత టిడిపి ఎంఎల్ఎ గతంలో వైసిపి నుండి టిడిపికి మారడంతో ఎంఎల్ఎతో పాటు పార్టీ మారిన కార్యకర్తలకు, ముందు నుండి టిడిపిలో ఉన్న కార్యకర్తలకు పొసగడం లేదు. వారం రోజులుగా విభేదాలు భగ్గుమనడంతో ఆ ఘర్షణ కేసుల దాకా వెళ్లడంతో వైరం ముదిరింది.

4 వ రోజు నవరాత్రి ఉత్సవాలు.

ప్రజాశక్తి - కంచికచర్ల : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 4 వ రోజు పలు దేవాలయాల్లో విగ్రహాలను పూలతో అలంకరించారు. స్థానిక శ్రీ శివ సాయిక్షేత్రంలో పార్వతి దేవి విగ్రహాన్ని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. ఈ అలంకరణ పూజా కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ చాపా సత్యనారాయణ లక్ష్మి ప్రసన్న దంపతులు దర్శించుకున్నారు. స్థానిక వసంత కాలనీ, పశువుల ఆసుపత్రి రోడ్, హనుమాన్ పేటలో ఏర్పాటు చేసిన విగ్రహాలను వివిధ రూపాల్లో అలంకరించారు. మహిళలు బతుకమ్మ ఆటలు నిర్వహించారు.

ఏ రోడ్డు చూసినా మురుగే

గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు

ప్రజాశక్తి - ఎ.కొండూరు :

ప్రభుత్వాలు మారినా ఎ.కొండూరు మండలం చెవుటూరు గ్రామం అభివృద్ధిలో ఏ మార్పూ ఉండటం లేదు. అభివృద్ధి చెందుతూ ఉన్న గ్రామంగానే మిగిలిపోతుంది. గ్రామంలోని బాపూజీ కాలనీలో 500 పైబడి జనాభా నివసిస్తున్నారు. సిమెంటు రోడ్లు వేసి డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురికి నీరు పారుదల లేక రోడ్లపైనే ప్రవహిస్తుంది. కనీసం బ్లీచింగ్ చల్లే నాథుడే లేడు. ఇక వర్షాకాలంలో కాలనీవాసుల అవస్థలు వర్ణనాతీతం. దీనితోపాటు గ్రామంలో వీధి వీధికి చెత్త సేకరణ లేకపోవడంతో గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలుగా పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి.

గ్రామంలో వాడుక నీటి సమస్య ఎప్పటి నుంచో ఉంది. దీనిని ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పూర్తిస్థాయిలో పరిష్కరించలేకపోతుంది. వేసవి కాలంలో నీటి ఎద్దడి ఇక చెప్పక్కరలేదు. 2009- 2014 రెండు పర్యాయాలు టిడిపి తరఫున మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గెలిచారు. ఒసారి మంత్రిగా కూడా పనిచేశారు. కానీ ఈ గ్రామ అభివృద్ధిని మరిచారు. 2019లో ప్రస్తుత ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ విజయం సాధించి ఎన్నికల్లో డ్రైనేజీలు వేస్తానని హామీ ఇచ్చి తీరా గెలిచాక ఆ హామీని గాలికి వదిలేశారు. 2024లో టిడిపి తీర్థం పుచ్చుకున్న వసంత కృష్ణ ప్రసాద్ మరలా అదే హామీని ఇచ్చి ప్రభుత్వం వచ్చి వంద రోజులవుతున్న ఆ ఊసే లేదు.

విషజ్వరాలు వస్తాయేమోనని భయపడుతున్నాం : షేక్ నన్నెసా

వర్షం పడినప్పుడు రోడ్డుకి కాలువకు తేడా ఉండదు. డ్రైనేజీలు లేకపోవడం వలన ఇళ్లలో వాడిన మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. రోడ్లపై నడవాలంటేనే ఇబ్బందిగా ఉంది. మురికి నీటిలో దోమలు కూడా విపరీతంగా ఉంటున్నాయి. విష జ్వరాలు వస్తాయని భయంగా ఉంది.

మత్స్యకారుల భద్రతకు ప్రాధాన్యత : మంత్రి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సముద్రంలో వేట సాగించే మత్స్యకారుల భద్రత ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లు కలిగిన 50 మంది మత్స్యకారులకు ఆదివారం సాయంత్రం నగరంలోని మంత్రి నివాసం వద్ద ఆయన ట్రాన్స్పాండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సముద్రంలో వేట సాగించే మత్స్య కారుల భద్రత కోసం కమ్యూనికేషన్ వ్యవస్థ కలిగిన ట్రాన్స్పాండర్లను మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లు కలిగిన యజమానులకు అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో మిగిలిన అందరికీ ఈ పరికరాలను అందిస్తామన్నారు. ఈ పరికరం బోట్లకు అమర్చడం ద్వారా అనుకోని పరిస్థితుల్లో బోటు ఆగిపోయిన లేదా తప్పిపోయినా బోట్లను గుర్తించడానికి ఈ పరికరం ఎంతో ఉపయోగ పడుతుందని, బోటు యజమానులతో సమాచారం ఇచ్చి పుచ్చుకోవటానికి సహాయపడుతుం దన్నారు. అంతే కాకుండా ఈ పరికరం సముద్రంలోని మత్స్య సంపద లభ్యతను గుర్తించేందుకు సైతం సహాయ పడుతుం దన్నారు. మత్స్యకారుల ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని శాటిలైట్ విధానములో పనిచేసే దాదాపు రూ.37 వేల విలువైన ట్రాన్స్పాండర్ పరికరం 60 శాతం కేంద్ర ప్రభుత్వం, మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాతో కలిపి లబ్ధిదారులకు పూర్తి సబ్సిడీతో ఉచితంగా అందిస్తుందన్నారు. దేశానికి అత్యధిక విదేశీ మారకద్రవ్యం అందిస్తున్నది మత్సశాఖ ద్వారానే అని, దాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. మత్స్యకారులు జీవనోపాధికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో కామన్ ఫెసిలిటీ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా త్వరలో మత్స్యకారులకు వేట నిషేధ భతి అందిస్తామని, 50 సంవత్సరాలు దాటిన మత్స్యకారులకు పింఛన్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు రావి వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాగ రమేష్, మెకనైజ్డ్ బోట్స్ ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు మోకా రవి, మత్స్య శాఖ ఎఫ్ డి ఓ వి సత్యనారాయణ, బోటు యజమానులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ

ప్రజాశక్తి, వన్‌టౌన్ : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదివారం ఇంద్రకీలాద్రిపై భక్తులకు చేసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సామాన్య భక్తులకు సాఫీగా అమ్మ దర్శన భాగ్యం కల్పించేలా సేవలు అందిం చాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. భక్తులతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకున్నారు. వికలాంగులు, వృద్ధులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల అభిప్రాయాలను తీసుకున్నారు. అనంతరం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకత అమ్మవారిని దర్శించుకొని వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు.

చిన్నారులను అభినందించిన మంత్రి

ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం సాయంత్రం కృష్ణానది ఒడ్డున దుర్గా ఘాటు వద్ద నవ హారతులు కార్యక్రమానికి హాజరయ్యారు. కృష్ణమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నత్య ప్రదర్శ నలు విశేషంగా అలరించాయి. చిన్నారులను అభినం దించి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రోత్సహించారు. భక్తులకు స్వయంగా ప్రసాదాలు అందజేశారు.

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఓ రామారావు

దుర్గగుడి క్యూలైన్లో బాలికకు అస్వస్థత

ప్రజాశక్తి, వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నాల్గవ రోజు ఆదివారం అమ్మవారు శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి అవతారంలో దుర్గమ్మ దర్శనం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవు రోజు కావటంతో దుర్గమ్మ దర్శనానికి యాత్రికులు పోటెత్తారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో రూ. 500ల టిక్కెట్లు కొనుగోలుచేసిన ఓ కుటుంబం క్యూ లైనులో వస్తూ ఉండగా ఓం టర్నింగ్ దాటిన తరువాత వారి కుమార్తె ఉన్నట్టుండి కళ్ళు తిరిగి అస్వస్థతకు గురైంది. దీంతో సంబంధిత కుటుంబం కంగారు పడుతుండటంతో అటుగా వెళ్తున్న మీడియా ప్రతినిధులు చూసి మహిళా కానిస్టేబుల్, వాలంటీర్ల సహాయంతో ఆ బాలికను క్యూ లైను నుండి పై నుండి బయటకు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ ప్రాంతం లోని ఆ క్యూ లైనులో ఎమర్జెన్సీ ద్వారం లేకపోవటమే కారణం. అసలే మండుతున్న ఎండలకు ఒక పక్క వాతావరణం వేడెక్కి, మిట్ట మధ్యాహ్నం కావటం, దీనికి తోడు అక్కడ ఎమర్జెన్సీ ద్వారం లేకపోవటంతో ఆ బాలికను పై నుండి కష్టం మీద బయటకు తీసి ఫస్ట్ ఎయిడ్ వద్ద తీసుకెళ్ళటంతో సమస్య తొలగింది. ఏదిఏమైనా రానున్న రోజుల్లో మరింత మంది యాత్రికులు తరలివచ్చే ప్రమాదం వుంది. కనుక సాధ్య మైనంత వరకూ క్యూ లైనులలో ఎమర్జెనీ ద్వారాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని యాత్రికులు కోరుతున్నారు.

మనోరంజకంగా సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాల్గవరోజు ఆదివారం జగన్మాతను శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో దర్శించుకునేందుకు వస్తున్న భక్తులను ఆధ్యాత్మిక తరంగాలలో విహరింపజేసే కళా ప్రదర్శనలు రంజింప చేస్తున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాలలో పాలొని అమ్మవారిని కనులారా చూడాలని వస్తున్న భక్తులు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళా ప్రదర్శనలు తిలకించి భక్తులు మైమరచిపోతున్నారు. ప్రతిరోజు కళావేదికపై స్వర, నత్య ప్రదర్శనలు ఆహ్లాదకరంగా సాగుతున్నాయి. శారద చెప్పిన హరికథ భక్తులను పరవశింప చేసింది.

పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - గుడివాడ : రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డాక్టర్ పెరుమాళ్ళ కేశవరావు కుమార్తె డాక్టర్ లలిత సహకారంతో ఆదివారం స్థానిక కోతి బొమ్మ సెంటర్లోని పెరుమాళ్ళ గార్డెన్స్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కో-ఆర్డి నేటర్ చిట్టినేని సూర్యచంద్రరావు, క్లబ్ అధ్యక్షుడు .రాజశేఖర్, సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. మండల కేంద్రమైన పుట్లవల్లేరులో ఆదివారం ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 670 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు కణితి శశిరేఖ హనుమకొండ దుర్గ భవాని, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగం శెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి గుడివాడ హోమియో వైద్యులు పి భవాని, తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** పోరంకిలోని పెనమలూరు టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో అనుమోలు ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

గుడివాడలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో

కంకిపాడులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

అన్నసమారాధన చేస్తున్న దృశ్యం

అన్నసమారాధన

ప్రజాశక్తి-గుడివాడ : శాంతి నిమిత్తం అన్నసమారధన నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్‌తో కలిసి యలవర్తి శ్రీనివాసరావు అన్నసమారాధన ప్రారంభించారు. శాంతి నిమిత్తం 10వేల మందికి అన్న సమారాధన నిర్వహించినట్లు ఉత్సవ కమిటి చైర్మన్ సాయన రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిన్నమనేని బాబ్జి, మాజీ కౌన్సిలర్ గోకరకొండ బలరాం, వెనిగండ్ల రామకష్ణ(నాని), దేవస్థానం కమిటీ సభ్యులు, ఈవో యార్లగడ్డ వాసు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా వేల్పూరు వంతెన

ప్రజాశక్తి-పమిడిముక్కల : వేల్పూరు వంతెన కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. వేల్పూరు వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగి సగం వంతెన కూలి నీటిలో పడిపోయింది. కనుమూరు వెళ్లడానికి అటు నుండి విజయవాడ మచిలీపట్నం వెళ్లడానికి ఈ వతెనే ఆధారం. హనుమంతపురం, మల్లపూడి, అయినంపూడి గ్రామస్తులు ప్రతిరోజూ ఈ వంతెన పైనుంచే రాకపోకలు సాగిస్తుం టారు. కనుమూరు ఉన్నత పాఠశాలకు విద్యార్థులు రోజు దీని పైనుంచే వెళ్ళవలసి ఉంది. ఈ వంతెన ప్రమాదభరితంగా ఉండడంతో కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు అధికారులకు విన్నవిస్తున్నారు. పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్మా ణం చేపట్టేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న మంత్రి, హీరో, హీరోయిన్ తదితరులు

బందరులో 'జనక అయితే గనుక' చిత్రయూనిట్ సందడి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : టాలీవుడ్ టాలెంటెడ్ హీరో సుహాస్ నటించిన 'జనక అయితే గనుక' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ మచిలీపట్నం వేదికగా ఆదివారం ఘనంగా జరిగింది. మచిలీపట్నం నోబుల్ కాలేజ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు ప్రముఖ నిర్మాత దిల్ రాజు, హీరోయిన్ సంగీర్తన, దర్శకులు సందీప్ తోపాటు చిత్ర యూనిట్ మొత్తం తరలి వచ్చింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మైన్స్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్ర యూనిట్ కు ఆల్ ది బెస్ట్ చెప్పారు.దసరాకు ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ సినిమా ఘన విజయం సాధిస్తుందన్న ఆశాభావాన్ని మంత్రి రవీంద్ర వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ఎంతో మంది కళాకారులను సినీ రంగానికి అందించిన మచిలీపట్నం గడ్డపై జనక అయితే గనక' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎస్ఆర్‌టి సి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పెడన శాసన సభ్యులు కాగిత కష్ణప్రసాద్, గుడివాడ మాజీ శాసన సభ్యులు రావి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల అభ్యున్నతే 'నోవా' లక్ష్యం

వ్యవస్థాపక అధ్యక్షులు, ఎంఎల్‌ఎ సాంబశివరావు

విజయవాడ : అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా నోవా అగ్రి గ్రూప్ రైతన్నలకు నిరంతరం సేవలందిస్తుందని నోవా వ్యవస్థాపకులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం విజయవాడ ఫార్చ్యూన్ మురళి హోటల్ వేదికగా నోవా ఫ్యామిలీ మీట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఫౌండర్ ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడారు. ఒక్కడితో మొదలైన నోవా అగ్రి గ్రూప్ నేడు వేలాదిమంది ఉద్యోగులతో వేలాదిమంది డీలర్లతో దేశవ్యాప్తంగా అన్నదాతల మన్ననలు పొందుతూ అగ్ర భాగాన్ని నిలిచిందన్నారు. దేశంలో నెంబర్ వన్ స్థానంలో నోవా నిలవడానికి అందరి ఐక్యత సమన్వయం రైతుల నమ్మకమే కారణం అన్నారు. అన్నదాతల కష్ట సమయంలో నూతన ఉత్పత్తులను తయారు చేసి వారికి అండగా నిలిచి సమర్థవంతంగా సేవలందించిన ఘనత నోవా దేవనన్నారు. అన్నదాతల నమ్మకమే పెట్టుబడిగా దేశంలోనే అన్ని రాష్ట్రాలలో ప్రత్యేక గుర్తింపు సాధించామని దీనికి ప్రధాన కారణం నోవా ఉత్పత్తుల అద్భుత పని తీరే అన్నారు. తాను డాక్టర్ అవ్వాలని కోరిక ఉందని అప్పటి పరిస్థితులకు కనుగుణంగా వ్యవసాయ విద్యను అభ్యసించి రైతాంగానికి విస్తృత సేవలు అందించాలని లక్ష్యంతో ఉద్యోగానికి రిజైన్ చేసి కంపెనీని 2007లో హైదరాబాద్ వేదికగా ప్రారంభించానన్నారు. ప్రస్థానం ప్రారంభించిన నోవా నోవా అగ్రి టెక్ అన్నదాతల శ్రేయస్సు కోసం అనేక పరిశోధనలు జరిపి నాణ్యమైన ఉత్పత్తులను అందించిందన్నారు.

నోవా ఫ్యామిలీ మీట్‌ను ప్రారంభిస్తున్న ఏలూరి

అన్నదాతల నమ్మకమే విజయం

అన్నదాతల నమ్మకమే సంస్థ విజయానికి చిహ్నామని నోవా అగ్రిటెక్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఏటుకూరి కిరణ్ కుమార్ అన్నారు.'నోవా అగ్రిటెక్‌పై రైతన్నల నమ్మకం విశ్వాసంతో అంకితభావంతో వ్యవసాయ ఉత్పత్తులను రూపొందించి కంపెనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సిఇఒ మందలపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు డీలర్లు ఇదే స్ఫూర్తితో అన్నదాతలకు సేవలు అందిస్తూ మరింత ముందుకు సాగాలన్నారు. కంపెనీకి కీర్తి ప్రతిష్టలను పెంచే దిశగా అన్నదాతల అవసరాలకు అనుగుణంగా విస్తృత సేవలు అందించాలన్నారు. 700 రకాల ఉత్పత్తులను రైతులకు అందిస్తూ విశేష సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాజేష్ , నేషనల్ మార్కెటింగ్ హెడ్ హర్ష, రీజినల్ మేనేజర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అండర్ - 14, 19 బాలుర ఫ్రీస్టైల్ బాలుర ఛాంప్ కృష్ణా

చిత్తూరు బాలికల సత్తా - గ్రీకో రోమన్‌లో తిరుగులేని నెల్లూరు

ప్రజాశక్తి - విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల రెజ్లింగ్ టోర్నమెంట్‌లో అండర్ -14, 19 బాలుర ఫ్రీస్టైల్ ఛాంపియన్ షిప్‌ను కృష్ణా జిల్లా కైవసం చేసుకుంది. బాలికల చాంపియన్ షిప్ ను చిత్తూరు జట్టు కైవసం చేసుకుంది. కాగా అండర్ -17, 19 విభాగాల గ్రీకో రోమన్ చాంపియన్ గా నెల్లూరు జట్టు నిలిచింది. స్కూల్ గేమ్స్ ఎన్టీర్ జిల్లా ఆధ్వర్యంలో నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మూడు రోజులపాటు స్థానిక అశోక్ ఫంక్షన్ హాల్ లో పోటీలను నిర్వహించింది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఈ కార్యక్రమానికి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సదరన్ సీనియర్ జనరల్ మేనేజర్ కే నాగ మోహనరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చాంపియన్లుగా నిలిచిన జిల్లా జట్లకు ఆయన ట్రోఫీలు అందజేశారు. అంతకుముందు వ్యక్తిగతంగా బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. నాగ మోహనరావు మాట్లాడుతూ 700 మంది విద్యార్థులు రెజ్లింగ్ పోటీలలో పాల్గొని గెలుపు కోసం పోటీ పడటం ముదావహమన్నారు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుతంగా రాణించిన వారిని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. హెచ్ఎం వజ్రాల భూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పరిశీలకుల రమేష్, వెంకట కష్ణ, నున్న హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు నరెడ్ల సత్యనారాయణ రెడ్డి, గుంటక శివ శేషిరెడ్డి (బాబు), అశోక్ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు కొండేటి రాంబాబు, రెజ్లింగ్ పితామహుడు భూషణం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) రెజ్లింగ్ కోచ్ లు మనోహర్, ఉదయ్, పూర్ణ, పోటీల నిర్వాహక కమిటీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు, రెజ్లింగ్ కోచ్ భార్గవ్ పాల్గొన్నారు.

సెరిబ్రల్ పాల్సీ రోగులకు అను ఆస్పత్రిలో అనువైన చికిత్స

పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.దుర్గా నాగరాజు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : సరైన చికిత్సలు అందించడం ద్వారా సెరిబ్రల్ పాల్సీ రోగులకు సక్రమంగా నడిచేందుకు అవకాశం కల్పించవచ్చని ప్రముఖ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.దుర్గా నాగరాజు తెలిపారు. వరల్డ్ సెరిబ్రల్ పాల్సీ డే పురస్కరించుకుని ఆదివారం సూర్యారావుపేటలోని అను హాస్పిటల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ దుర్గా నాగరాజు మాట్లాడుతూ మెదడులోని కణజాలం దెబ్బతినడం వల్ల సెరిబ్రల్ పాల్సీ సమస్య ఏర్పడవచ్చని అన్నారు. కండరాలు బిగుతుగానూ, వదులుగానూ మారిపోవడం వల్ల సంబంధిత శరీర భాగాలు సక్రమంగా పనిచేయలేవని, మెదడులో దెబ్బతిన్న కణజాలం ఆధారంగా సెరిబ్రల్ పాల్సీ రుగ్మతను మూడు రకాలుగా విభజించారని చెప్పారు. రక్తపరీక్షలు, ఎక్స్-రేల ద్వారా సమస్యను గుర్తించడం సాధ్యం కాదని, బ్రెయిన్ ఎంఆర్ఐ స్కాన్ ద్వారా సెరిబ్రల్ పాల్సీని నిర్ధారించవచ్చని అన్నారు. సెరిబ్రల్ పాల్సీ అనేది మానసిక సమస్య కాదని, శారీరక రుగ్మత మాత్రమేనని డాక్టర్ దుర్గా నాగరాజు వివరించారు. ఈ సమస్య కారణంగా పిల్లల ఎదుగుదల ఆలస్యమవుతుందని, కాళ్లు, చేతులకు సంబంధించిన కండరాలు బిగుసుకుపోయి పిల్లలు నడవడలేకపోతారని అన్నారు. రెండేళ్ల వయసు దాటినా పిల్లలు నడవలేకపోతున్నట్లయితే సెరిబ్రల్ పాల్సీ కారణం కావచ్చని, కండరాల సమతుల్యత లోపించిన కారణంగా కాళ్లు, చేతులు వంకరపోవడం, గూని సమస్య తలెత్తడం గుర్తించవచ్చని తెలిపారు. సెరిబ్రల్ పాల్సీ లక్షణాలను గుర్తించిన వెంటనే చికిత్స ఆరంభిస్తే మెరుగైన ఫలితాలను సాధించవచ్చు. దెబ్బతిన్న మెదడు కణజాలాన్ని సరిచేయడం సాధ్యంకాకపోయినప్పటికీ.. ఫిజియోథెరపీ, బొటాక్స్ ఇంజెక్షన్లు, ఆపరేషన్ల ద్వారా సెరిబ్రల్ పాల్సీ సమస్యకు చికిత్స అందించవచ్చని చెప్పారు. ఒకప్పుడు సెరిబ్రల్ పాల్సీ రోగులకు ఆపరేషన్ చేసేందుకు పదేళ్ల వయసు దాటే వరకూ వేచిచూసేవారని, ఆపరేషన్ తర్వాత రోగి నడిచేందుకు ఒకట్రెండు నెలల సమయం పట్టేదని అన్నారు. కండరాల బిగువును బట్టి మూడేళ్ల వయసు దాటిన అనంతరం ఎప్పుడైనా ఆపరేషన్ చేయవచ్చని డాక్టర్ కె. దుర్గానాగరాజు అన్నారు. అను హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జి. రమేష్ మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీ కారణంగా నడవలేని, నడకలో వ్యత్యాసం ఉన్న చిన్నారులకు, కాలు, చేయి వంకర, పుట్టుకతో అంగవైకల్యం ఉన్న పిల్లల కోసం ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అను హాస్పిటల్ వైద్యులు హాస్పిటల్ సిఇఒ రమేష్, డాక్టర్ జి.శ్రీదేవి, డాక్టర్ విశ్వేశ్వరరావు, పీడియాట్రిషియన్ డాక్టర్ శ్వేత, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రమ్య, సెరిబ్రల్ పాల్సీ సమస్యతో బాధపడుతున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు, సంరక్షకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు వీలర్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.